# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ జనవరి 26 ఆదివారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 190

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



దేశం పై ఉన్న ప్రేమ, అభిమానం,
గౌరవం మిమ్మల్ని ఉన్నత శిఖరాలకు
చేర్చాలని మేము కోరుకుంటున్నాం
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు




# పథకాల పండగ నేడే

## నేటి నుంచే ఆ నాలుగు పథకాలకు శ్రీకారం

- గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లబ్దిదారుల ఎంపిక
- అర్హుల్లో ఒక్కరికి అన్యాయం జరగొద్దు..అనర్హులకు చోటు దక్కొద్దు
- పథకాల అమలుపై అధికారులు, మంత్రులతో సిఎం రేవంత్ సమీక్ష
- గ్రామానికో అధికారి చొప్పన పథకాల అమలుకు ఆదేశాలు



**రాష్ట్రంలో నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాలకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం నుంచి రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభిస్తోంది.**

**నాలుగు పథకాలను తొలుత 606 గ్రామాల్లో ప్రారంభిస్తాం. ఫిబ్రవరి మొదటివారం నుంచి మార్చి 31లోగా రాష్ట్రమంతటా అమలు చేస్తాం. ఆయా జిల్లాల మంత్రులు, ఇన్‌ఛార్జి మంత్రులు ఎంపిక చేసిన గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారు.**

**-సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్: రాష్ట్రంలో నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాలకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం నుంచి రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభిస్తోంది. హైదరాబాద్ నగరం మినహా మిగిలిన 606 మండలాల్లోని ఒక్కో గ్రామంలో నాలుగు పథకాలకు అర్హులైన లబ్ధిదారులందరికీ సాయం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు పథకాల పండగ ప్రారంభోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం 2.30 వరకు సాయం పంపిణీ జరుగుతుంది. నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను ప్రారంభించనున్నారు. శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నాలుగు పథకాల అమలుపై సీఎం అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ, పౌరసరఫరాలు, గృహ నిర్మాణశాఖల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. సమీక్ష అనంతరం మంత్రులు సచివాలయంలో సమావేశ వివరాలను, పథకాల అమలు గురించి వెల్లడించారు.

మార్చి వరకు గుర్తింపు ప్రక్రియ: భట్టి

"రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు నాలుగు పథకాలు లాంఛనంగా ప్రారంభించబోతున్నాం. ప్రతి మండలంలోని ఒక గ్రామంలో నూరుశాతం అమలుచేస్తాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా.. భూమిలేని నిరుపేదలై, ఉపాధి హామీ పథకంలో 20 రోజులపాటు పనిచేసిన వారందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లభిస్తుంది. గ్రామసభలు నిర్వహించి అర్హత కలిగిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాం. లక్షల్లో దరఖాస్తులు వచ్చినందున ఆదివారం నుంచి మార్చి వరకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది"

అని భట్టి పేర్కొన్నారు. రేషన్ కార్డుదారులందరికీ

ఇకపై సన్నబియ్యం: ఉత్తమ్

"దేశచరిత్రలో ఇదో ప్రత్యేక సందర్భం. ఒకేసారి ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడం మొదటిసారి. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది. కార్డుల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దు. సామాజిక ఆర్థిక సర్వేలు, ప్రజాపాలన, ప్రజావాణి లేదా మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరినీ పరిగణనలోకి తీసుకున్నాం. జాబితాలో లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. కార్డుల జారీ ప్రక్రియ ముగిశాక.. అన్ని పేద కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది" అని ఉత్తమ్ వెల్లడించారు.

**రైతు సంక్షేమమే ధ్యేయం: తుమ్మల**

"దేశంలో ఎక్కడాలేని విధంగా రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుభరోసా కోసం రూ.7,625 కోట్లు ఇచ్చాం. రూ.22,000 కోట్లతో రుణమాఫీ

అమలు చేశాం. ఇవిగాక బోనస్, మద్దతు ధరల పంట ఉత్పత్తుల కొనుగోలు తదితరాలకు భారీగా నిధులు వెచ్చిస్తున్నాం. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12,000 సాయం చేయబోతున్నాం" అని తుమ్మల చెప్పారు.

## ఫోన్ ట్యాపింగ్‌లో మరో మలుపు

**త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఫోన్ ట్యాప్**



**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయినట్లు పోలీసులు గుర్తించారు. 2023 నవంబర్ నుంచి 15 రోజుల పాటు ఆయన ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో గవర్నర్ పీఏ నర్సింహ స్టేట్మెంట్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు రికార్డు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్

అయిందని ఇంద్రసేనారెడ్డి ఇప్పటికే చెప్పిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా ఆయన పీఏ స్టేట్మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారు.ప్రతిపక్ష నేతలు, ప్రజా సంఘాల నేతలే టార్గెగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని, ఇందులో నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు కీలకంగా వ్యవహరించారని మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్ రావు విచారణలో గుట్టు బయట పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభాకర్?రావును ఈ కేసులో ప్రధాన నిందితుడి(ఏ1)గా పోలీసులు చేర్చారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిన విధానాన్ని విచారణలో దర్యాప్తు అధికారులకు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న వెల్లడించారు. నాడు ఇంటెలిజెన్స్ చీఫ్?గా ఉన్న ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఒప్పుకున్నారు. నాటి ప్రభుత్వ పెద్దలు, ప్రభాకర్ రావు నుంచి అందిన ఫోన్? నంబర్ల ఆధారంగా ట్యాపింగ్ చేసేవాళ్లమని తెలిపారు. వందల సంఖ్యలో ఫోన్ నంబర్స్ అందేవని చెప్పారు. అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఇండ్ల పరిసరాల్లో ట్యాపింగ్ సెంటర్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ప్రభాకర్‌రావుకు అందించేవాళ్లమని తెలిపారు. అసెంబ్లీ ఫలితాలు వెలువడిన వెంటనే ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ట్యాపింగ్ డివైజ్?లు, హార్డ్ డిస్క్?లను ధ్వంసం చేసినట్లు ఈ ముగ్గురూ విచారణలో అంగీకరించినట్లు పోలీసులు ఇప్పటికే పేర్కొన్నారు.



## అదనపు న్యాయమూర్తులుగా నలుగురు జడ్జిలు ప్రమాణస్వీకారం

**హైదరాబాద్:**తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నియమితులైన నలుగురు అదనపు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. జస్టిస్ రేణుకా యారా, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ ఇ.తిరుమలదేవి, జస్టిస్ బి.ఆర్.మధుసూదన్‌రావుతో హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్ పాల్ ప్రమాణం చేయించారు. ఇంతకుముందు రేణుక యారా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జిగా, నందికొండ నర్సింగ్‌రావు సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా, ఇ.తిరుమలాదేవి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, విజిలెన్స్ రిజిస్ట్రార్‌గా, బి.ఆర్.మధుసూదన్‌రావు హైకోర్టు రిజిస్ట్రార్(పరిపాలన)గా బాధ్యతలు నిర్వర్తించారు.



2లో..

## రైతుల ఆత్మహత్యలపై స్పందనేదీ

ఎంతమంది మరణించినా ఇంత నిర్లక్ష్యమా

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

## పండగ వాతావరణంలో పథకాల ప్రారంభం

**మండలానికో గ్రామం ఎంపిక చేసి అందచేత**

**గ్రామసభలో లబ్దిదారులు హాజరయ్యేలా చూడాలి**

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్ ఆదేశాలు**



**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను రాష్ట్రంలోని ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులైన వారందరికీ అందించాలని నిర్ణయించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. ఈ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు. ఈ సభకు లబ్దిదారులందరూ హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ పథకానికి సంబంధించి లబ్దిదారుల జాబితాను గ్రామసభలో ప్రముఖంగా ప్రదర్శించాలని తెలిపారు. జాతీయ పర్వదినమైన గణతంత్ర దినోత్సవంనాడు ఈ పథకాలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ శాంతి కుమారి సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్

మిగతా 2లో



2లో..

## కేంద్రం నిధులిస్తోంది.. మోడీ ఫోటో పెట్టాల్సిందే

ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడితే ఊరుకునేది లేదు

రేషన్ కార్డులపైనా ప్రధాని ఫోటో ఉండాల్సిందే

లేకుంటే ఉచిత రేషన్ పంపిణీని ఆపేస్తాం

కేంద్రమంత్రి బండి సంజయ్ హెచ్చరిక

కొత్త రేషన్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రధాని మోదీ ఫొటో ముద్రించాల్సిందేనని అన్నారు. రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో పెట్టకపోతే ఉచిత బియ్యం ఎందుకివ్వాలని ప్రశ్నించారు. ప్రధాని ఫొటో పెట్టకపోతే పేదలకు కేంద్రమే నేరుగా ఉచిత బియ్యం అందించే అంశంపై ఆలోచన చేస్తామన్నారు.



2లో..

## ఢిల్లీలో పాగాకు బిజెపి యత్నాలు

వరుసగా మేనిఫెస్టోలు విడుదల

మూడో మేనిఫెస్టో విడుదల చేసిన అమిత్ షా

## ప్రతిభను వరించిన పద్మం

న్యూఢిల్లీ : వివిధ రంగాల్లో విశేష ప్రతిభను కనబరిచిన ప్రతిభామూర్తులు, సామాజిక సేవకులకు కేంద్ర ప్రభుత్వం శనివారం 'పద్మ' పురస్కారాలను ప్రకటించింది. గణతంత్ర దినోత్సవ వేళ కళలు, సామాజిక సేవ, వాణిజ్యం, పరిశ్రమ, సాహిత్యం, విద్య, క్రీడలు, పౌర సేవలు తదితర వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వారిని ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలు దక్కాయి. దేశ రెండోఅత్యున్నత పౌర పురస్కారమైన పద్మ విభూషణ్ పురస్కారానికి ఏడుగురు, మూడో అత్యున్నత పురస్కారమైన పద్మభూషణ్‌కు 19 మంది ఎంపికయ్యారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, ఏఐజీ దవాఖానల అధినేత డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్ రెడ్డికి తెలంగాణ నుంచి పద్మ విభూషణ్ పురస్కారం వరించింది.






ఏడుగురికి పద్మ విభూషణ్,19 మందికి పద్మ భూషణ్ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వంతెలంగాణ నుంచి నాగేశ్వర్ రెడ్డికి పద్మ విభూషణ్, మందకృష్ణకు పద్మ శ్రీ పురస్కారాల ప్రకటన వివిధ రంగాల్లో ప్రముఖులైన113 మందికి పద్మశ్రీ గౌరవం.. తెలుగు రాష్ట్రాల్లో ఏడుగురిని వరించిన 'పద్మ' పురస్కారాలు నటులు బాలకృష్ణ, శేఖర్‌కపూర్, శోభన, అజిత్‌కు పద్మభూషణ్

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు అమూల్య మైనది.




- సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, జనవరి 25:**

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది లాంటిదని,పాలకుల రాజకీయ చతురత, గుణగణాలు దేశ నిర్మాణానికి మూలమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు అమూల్యమైనదని, వయోజనుల పాత్ర కీలకమని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. తదనంతరం ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, ఓటు అనే రెండు అక్షరాలకు దేశ పరిపాలన స్థితిగతులను మార్చేశక్తి ఉందని, కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష అనే భేదం లేకుండా దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 ద్వారా ఓటు హక్కును కల్పిస్తున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర, చట్టసభలలో, స్థానిక స్వపరిపాలన సంస్థల్లో విప్లవాత్మకమైన మార్పులకు ఓటు హక్కు ప్రధానమైనదన్నారు. ప్రస్తుతం ఎన్నికలలో పెరిగిపోతున్న కుల, మత, ధన మద్యం ప్రాభాల్యాన్ని, హింసను నిరోధించి ప్రజాస్వామ్య ప్రాభావాన్ని, ఔన్నత్యాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఎంతైనా ఉందన్నారు. ప్రజాస్వామ్యం గెలవాలంటే ప్రతి పౌరుడు ఎన్నికలలో తప్పక ఓటు హక్కు వినియోగించుకోవాలని, బేషజాలు తారతమ్యాలు లేకుండా ఆచితూచి భవిష్యత్తును నిర్మించే సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవడం ప్రతీ పౌరుడి ప్రాథమిక హక్కే కాకుండా భాధ్యతన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల ఆత్మహత్యలపై స్పందనేదీ

**హైదరాబాద్:**రాష్ట్రంలో అన్నదాతల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం ఉదయం ఆదిలాబాద్ జిల్లాలోని బజార్హత్నూర్ మండలం వర్తమన్నూర్‌కు చెందిన మామిళ్ల నర్సయ్య పొలంలో ఉరేసుకున్నాడు. ఈ ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. రైతు మామిళ్ళ నర్సయ్య అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విచారకరం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే గడిచిన వారం రోజుల్లో నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం. రైతుల మరణ మృదంగం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఏం చేస్తున్నట్లు కాంగ్రెస్ పాలనలో రైతన్నకు భరోసా లేక మనోధైర్యం కోల్పోతున్నడు. అందరికి అన్నం పెట్టే అన్నదాతకు సున్నం పెడుతున్నది కాంగ్రెస్ పార్టీ అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.
నమ్మి ఓటేసిన పాపానికి నట్టేట ముంచి, నమ్మక ద్రోహం చేస్తున్నది. రుణమాఫీ పూర్తి చేసినట్లు రంకెలేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతులకు ఏమని సమాధానం చెబుతారు అని హరీశ్‌రావు నిలదీశారు. రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఆ రైతు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఆత్మహత్యలు పరిష్కారం కావు, బతికుండి కొట్లాడుదాం. అధైర్య పడొద్దు, బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుందని పిలుపునిస్తున్నా అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# ఢిల్లీలో పాగాకు బిజెపి యత్నాలు

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో గెలుపే లక్ష్యంగా బిజెపి హామీలు గుప్పిస్తోంది. వరుసగా మేనిఫెస్టోలను విడుదల చేస్తోంది. ఇప్పటికే రెండు మేనిఫెస్టోలు విడుదల చేసిన బిజెపి తాజాగా మూడో మేనిఫెస్టోను విడుదల చేసింది. వచ్చే నెల 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా మూడో మ్యానిఫెస్టోని విడుదల చేశారు. ఈ మ్యానిఫెస్టోలో బిజెపి ఢిల్లీ ప్రజలకు పలు హామీలిచ్చింది. శరణార్థి కాలనీల్లోని ప్రజలకు యాజమాన్య హక్కులను కల్పించడం, దేశ రాజధానిలో 13 వేలు సీల్ చేసిన దుకాణాలను తిరిగి తెరవడం వంటి హామీలను బిజెపి ప్రకటించింది. మ్యానిఫెస్టో విడుదల కార్యక్రమంలో పాల్గొన్న అమిత్ షా మాట్లాడుతూ.. '17 వేలకు పైగా అనధికార కాలనీలకు యాజమాన్య హక్కులు కల్పిస్తున్నట్టు మోడీజీ ప్రకటించారు. గతంలో ఈ కాలనీలకు నిర్మాణం, కొనుగోలు లేదా అమ్మకం కోసం అనుమతి లేదు. ఇప్పుడు ఈ కాలనీల్లో వారికి పూర్తి యాజమాన్య హక్కుల్ని కల్పించడం ద్వారా గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ నిబంధనలు, ఢిల్లీలో చట్టాల ప్రకారం ఆ కాలనీల్లో భవనాలను నిర్మించుకునే హక్కు, వాటిని అమ్ముకునే హక్కుకానీ వారికి లభిస్తుంది. ఢిల్లీలో సీల్ చేసిన 13 వేల షాపుల్ని తెరిచేందుకు న్యాయపరమైన సలహాలను న్యాయవాదులతో కలిసి చర్చిస్తాము. దీని కోసం ప్రత్యేకంగా జ్యుడిషియల్ అథారిటీతో ఈ షాపులను తిరిగి ఆరునెలల్లోపు తెరుస్తాము' అని ఆయన అన్నారు. అలాగే ఢిల్లీలో వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు హోంమంత్రి ప్రకటించారు. ఈ వెల్ఫేర్ బోర్డు ద్వారా ఐదు లక్షల నుంచి పది లక్షల వరకు కార్మికులు జీవిత బీమా పొందే అవకాశమున్నట్లు అమిత్‌షా ప్రకటించారు. ÷ూగా, ఢిల్లీలో నిరుద్యోగ యువత కోసం 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు బిజెపి ప్రకటించింది. వందశాతం ఢిల్లీని ఎలక్ట్రిక్ బస్ నగరంగా మార్చనుంది. ఆప్ హయాంలో యమునా నదిని శుభ్రపరచలేదు. తాము అధికారంలోకి వస్తే
యమునా నదిని శుభ్రపరుచుతామని బిజెపి తెలిపింది. ఇక మహిళలకు నెలకు 2 వేలు, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్లు బిజెపి హామీ ఇచ్చింది.

# సనాతన ధర్మం

## ఓ మహావట వృక్షం

అయోధ్యను సందర్శించే 2024లో ఆ సంఖ్య 10 నుంచి 12 కోట్లకు చేరుకుంది' అని తెలిపారు. గత పది రోజుల్లో 10 కోట్ల మంది భక్తులు మహాకుంభ్‌లో పవిత్ర స్నానాలు ఆచరించారని, రాబోయే 35 రోజుల్లో ఈ సంఖ్య 45 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నామని యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. మహాకుంభ్ ఆధ్యాత్మిక కార్యక్రమం ఐక్యతా సందేశాన్ని చాటుతోందని, ప్రపంచంలోని నలుమూలల ప్రజలను మహాకుంభ్‌కు ఆహ్వానించామని చెప్పారు. ఇక్కడ అన్నపానాదులు, బసకు ఎలాంటి కొరతా లేదని చెప్పారు. సామరస్యం, కరుణ, అందరూ ఒక్కటేనన్న సందేశాన్ని మహాకుంభ్ ద్వారా ప్రపంచానికి చాటిచెప్పనున్నట్టు యోగి తెలిపారు.



# రాజ్యసభకు విజయసాయి రాజీనామా

**న్యూఢిల్లీ:** వ్యక్తిగత కారణాలతోనే వైకాపా రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశానని విజయసాయిరెడ్డి తెలిపారు. జగన్‌కు విషయం తెలిపే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని అన్నారు. తనలాంటి వారు ఎందరు బయటకు వెళ్లినా జగన్‌కు వచ్చిన నష్టం లేదన్నారు. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు రాజీనామా లేఖ సమర్పించానని.. దాన్ని ఆయన ఆమోదించారని చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. 'ఇంకా మూడున్నరేళ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ రాజీనామా చేశాను. రాజీనామా మాత్రమే కాదు.. రాజకీయాల నుంచి కూడా వైదొలగాలని నిర్ణయించుకున్నాను. వైకాపా 2019లో 151 స్థానాలు సాధించింది. 2024 ఎన్నికల్లో ఆ పార్టీకి 40 శాతం
ఓటింగ్ వచ్చింది. జగన్ అత్యంత ప్రజాదరణ గల నాయకుడు. నాలాంటివాళ్లు వెయ్యి మంది వీడినా ఆయనకు ఉన్న ఆదరణ తగ్గదనేది నా ఉద్దేశం. రాజీనామా నిర్ణయాన్ని లండన్ పర్యటనలో ఉన్న జగన్‌కు ఫోన్‌లో వివరించాను. వైకాపాకు 11 మంది ఎమ్మెల్యేల బలమే ఉంది. నా రాజీనామాతో కూటమి లబ్ధి పొందుతుంది' అని విజయసాయిరెడ్డి అన్నారు.
అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు విజయసాయిరెడ్డి సమాధానమిచ్చారు. 'సుదీర్ఘ రాజకీయ జీవితంలో నాకు తెలిసి ఏరోజూ అబద్ధాలు చెప్పలేదు. హిందూ ధర్మాన్ని, వెంకటేశ్వరస్వామిని నమ్మిన వ్యక్తిగా అబద్ధాలు చెప్పను. వైఎస్ కుటుంబంతో నాలుగు దశాబ్దాలుగా అనుబంధముంది. వైఎస్ రాజారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జగన్.. ఇలా మూడు తరాలుగా ఆ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వారితో విభేదాలు లేవు.. భవిష్యత్తులోనూ రావు. 2011 ఆగస్టు 10న ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు. ఆ కేసుల్లో అప్రూవర్‌గా మారాలని ఎంత బలవంతపెట్టినా నిరాకరించాను. దైవాన్ని నమ్మిన వ్యక్తిగా నమ్మకద్రోహం, మోసం చేయడం నాకు తెలియదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాపై కాకినాడ సీపోర్టుకు సంబంధించిన కేసు పెట్టారు. లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. ఈడీ విచారణకు హాజరయ్యాను. కేవీ రావుతో సన్నిహిత సంబంధాలు, వ్యాపార లావాదేవీలు లేవని చాలా స్పష్టంగా చెప్పాను. కేవీ రావు చెప్పేది నిజమైతే ఆయన తన పిల్లలపై ప్రమాణం చేయాలి. కేసు పెట్టాకే కాకినాడ సీపోర్టు లావాదేవీల విషయం తెలిసింది. విక్రాంత్‌రెడ్డితో నాకున్న పరిచయం తక్కువ. నాకు ఏ వ్యాపారాలు లేవు.. నేను దేనిలోనూ భాగస్వామిని కాదు. 365 రోజులూ పార్టీ కోసమే పనిచేశా. వ్యాపార లావాదేవీలపై నాతో మా వియ్యంకుడు ఏరోజూ చర్చించలేదు. కుటుంబ వ్యవహారాలు బాగుండాలంటే ఆర్థిక, వ్యాపార లావాదేవీలు ఉండకూడదని బలంగా నమ్ముతానని అన్నారు. రాజకీయాల నుంచి తప్పుకొంటే ఇంకా బలహీనుడిని అవుతాను. అలాంటప్పుడు కేసులు ఎందుకు మాఫీ చేస్తారు?నన్ను ఎందుకు తప్పిస్తారు? నేను రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు వేరు. రాజ్యసభ ఎంపీగా అటు రాష్ట్రానికి, ఇటు పార్టీకి న్యాయం చేయలేను. నాకంటే శక్తి సామర్థ్యాలు ఉన్న వ్యక్తులు రాజ్యసభకు వస్తే రాష్ట్రానికి ఉపయోగ పడతారనే కారణంతో రాజీనామా నిర్ణయం తీసుకున్నాను. నాకు ఎవరిపైనా కోపంలేదు.. రాజీనామాలో ఎవరి ఒత్తిడీ లేదు.

# విజయసాయికి తత్వం బోధపడిందేమో

**విశాఖపట్టణం:** రాజకీయాల్లో ఉన్నా లేకపోయినా, తప్పు చేసిన వాళ్లు శిక్ష అనుభవించాల్సిందేనని, విజయసాయిరెడ్డి రాజీనామాపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. విజయసాయి రెడ్డికి కలలోకి గొడ్డలి వచ్చిందేమో, అందుకే భయపడి రాజీనామా చేసి ఉండొచ్చని హోంమంత్రి సెటైర్లు వేశారు. గత ఐదేళ్లలో దావోస్‌లో 4 సార్లు సమ్మిట్ జరిగితే ఒక్కసారి వెళ్ళొచ్చారని వంగలపూడి అనిత ఆరోపించారు. తిరనాళ్ళలో తప్పిపోయిన పిల్లాడి లాగా బిత్తర చూపులు చూస్తూ.. ఇట్స్ లెంగ్త్ క్వషన్ అన్నారని పేర్కొన్నారు. మానసికంగా క్షోభ అనుభవిస్తున్న పిల్లలపై కూడా ప్రతిపక్షం రాజకీయం చేయడం తగదన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని తాము అమలు చేస్తే.. వైసీపీ వాళ్ళు ఈ 7 నెలలలో రోడ్ల మీదకి వచ్చే పరిస్థితి ఉండేది కాదని హోంమంత్రి అనిత తెలిపారు. విజయసాయి రెడ్డికి తత్వం బోధపడిందని ఆరోపించారు. విజయసాయి రెడ్డికి ఆయన చేసిన పాపాలు కలలో కూడా గుర్తు వస్తూ ఉన్నట్లు ఉన్నాయి.. ఆయన వ్యవసాయం చేస్తే పచ్చని ప్రకృతి కూడా కలుషితం అవుతుందని విమర్శించారు. విశాఖ నగరాన్ని నాశనం చేసిన వ్యక్తి విజయ సాయి రెడ్డి.. చంద్రబాబు నాయుడుతో పాటు ఆయన కుటుంబాన్ని దూషించిన వ్యక్తి విజయసాయిరెడ్డి అని దుయ్యబట్టారు. ఆ తప్పుల నుంచి తప్పించుకోవడానికి ఆయన ప్రయత్నం చేస్తున్నారు.. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని తెలిపారు.చిన్న పిల్లలపై రాజకీయాలు చేయొద్దని హోం మంత్రి అనిత అన్నారు. ప్రతిపక్షాలు తమపై బురద జల్లుతున్నాయని విమర్శించారు. విశాఖ జువైనల్ హోమ్‌ను ఆమె పరిశీలించారు. రెండు రోజుల క్రితం సిబ్బంది తమను వేధిస్తున్నారని బాలికలు చేసిన ఆరోపణలపై ఇప్పటికే ఆమె నివేదిక కోరారు. వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విశాఖ బాలికల సదన్‌లో మొత్తం 56 మంది బాలికలు ఉన్నారని
మంత్రి చెప్పారు. వాళ్లు చదువుతో పాటు వివిధ రంగాల్లో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. కొంతమంది మానసికంగా ఇబ్బంది పడుతున్నారని.. వారిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 'పిల్లలను రక్షించే బాధ్యత ప్రభుత్వానిది. దీన్ని ఎవరో గుర్తుచేయాల్సిన అవసరం లేదు. మా బాధ్యత మాకు తెలుసు. సమస్య పరిష్కారం అయినా.. భవిష్యత్తులో ఎలాంటి సమస్య తిరిగి రాకూడదని ఈరోజు బాలికల సదన్‌ను సందర్శించాను. వైకాపా 'ఎక్స్' ఖాతాలో 80 శాతం అవాస్తవాలే. గత ఐదు సంవత్సరాలు అబద్దాలతో గడిపేశారు. ఇప్పుడు కూడా ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. తప్పు చేసిన వాళ్లకు కచ్చితంగా శిక్ష పడుతుంది. ఐదు సంవత్సరాలు రాష్ట్రాన్ని దోచేశారు.' అని అనిత విమర్శించారు.

# విధ్వంసం నుంచి అబివృద్ది వైపు అడుగులు

రావడానికి విముఖత చూపించారని తెలిపారు. ఏపీ అంటే గ్లోబల్‌గా అసహ్యం వేసే పరిస్థితికి తీసుకుని వచ్చారని మండిపడ్డారు. రాజకీయాల్లో అర్హత లేని వ్యక్తులు వస్తే ఇటువంటి పరిస్థితి వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు చేశారు. ఏపీకి హైదరాబాద్ లేదు అని రేవంత్ రెడ్డి అన్న వ్యాఖ్యలపై స్పందించిన సీఎం.. 'నేను హైదరాబాద్‌ను తెలుగు కమ్యూనిటీ కోసం డెవలప్ చేశాను.. దానిని ఎవరూ ఎలా చెప్పుకున్నా పర్వాలేదు' అని తెలిపారు.. జిందాల్ కూడా దావోస్ వచ్చారని... కడప స్టీల్ గురించి స్టార్ట్ చేయమని చెప్పినట్లు తెలిపారు. 95 వేల కోట్లు రూపాయలతో బీపీసీఎల్ రిఫైనరీ ఏపీలో స్టార్ట్ కాబోతుందన్నారు. ఆరునెలల్లో డీపీఆర్ రెడీ అవుతుందన్నారు. దేనికోసం దావోస్ వెళ్లి ఎంవోయూ ఎందుకు చేసుకోవాలని... అవసరం లేదుగా..ఎంవోయూలు చేసుకుంటేనే పరిశ్రమలు వచ్చినట్లు కాదన్నారు. మనం చేసే నెట్‌వర్క్ వలన భవిష్యత్‌లో పరిశ్రమలు వస్తాయని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌ను గతంలో అలానే డెవలప్ చేశానని.. అక్కడే తన తరువాత వచ్చిన వాళ్ళు హైటెక్ సిటీని ఎవరూ కూల్చలేదన్నారు. ఏపీలో ప్రజలు వచ్చి తనను కలిసే ప్రజా వేదికను కూల్చేశారని... ఆ తరువాత కూడా విధ్వంసం జరిగిందన్నారు. వ్యవస్థలు కూడా విధ్వంసం జరిగాయన్నారు. రాజధాని లేకుండా చేసి మూడు ముక్కల ఆట ఆడారని మండిపడ్డారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్ కు వచ్చే విమానాలు కూడా తగ్గిపోయాయని తెలిపారు. వారికి ఇచ్చే రాయితీలు కూడా జగన్ ఆపారన్నారు. మళ్ళీ వీటన్నిటినీ సరిదిద్దుతున్నానని... మళ్ళీ పునర్నిర్మాణం చేస్తున్నానని చెప్పారు. అందువలనే మనం ముందు వీటిపై దృష్టి పెట్టాలి.. వీటితో పాటు పరిశ్రమలు కూడా తెచ్చుకోవాలన్నారు. మన ఫ్రెండ్ షిప్, మన నెట్వర్క్ తప్పనిసరిగా పరిశ్రమలు తీసుకువచ్చేందుకు ఉపయోగపడతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.



రూ.95 వేల కోట్లతో ర్గి÷నైరీ ఏపీలో స్టార్ట్ కాబోతుంది. ఆరు నెలల్లో డీపీఆర్ రెడీ అవుతుంది. అతిపెద్ద ర్గి÷నైరీ రామాయపట్నంలో రూ.96 వేల కోట్లతో వస్తుంది. మిట్టల్ ప్లాంట్ అనకాపల్లికి వస్తోంది. రూ.1.35లక్షల కోట్లతో పనులు మొదలుపెడుతున్నారు. మరో సంవత్సరంలో కాకినాడకు గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ రాబోతుంది. మొత్తం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులతో వివిధ పరిశ్రమలు ఏపీకి రాబోతున్నాయి. గూగుల్
హెడ్‌తో మొన్న మాట్లాడాం. వారికి ఉన్న సమస్యలన్నీ తొలగించా. గూగుల్ సెంటర్ వైజాగ్‌లో ప్రారంభమైన వెంటనే అది గేమ్ ఛేంజర్ అవుతుంది. టీసీఎస్ కూడా వైజాగ్‌లో సెంటర్ ఏర్పాటు చేయబోతుంది. వైజాగ్ త్వరలో ఐటీ హబ్ కాబోతుందని అన్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చే విమానాలూ తగ్గిపోయాయి. వారికి ఇచ్చే రాయితీలూ జగన్ ఆపేశారు. నేను మళ్లీ వీటన్నిటినీ సరిదిద్దుతున్నా. వీటిని మళ్లీ పునర్నిర్మాణం చేస్తున్నా. అందువల్ల ముందు వీటిపై దృష్టి పెట్టాలి. వీటితోపాటు పరిశ్రమలూ తెచ్చుకోవాలి. ఏపీలో పర్యాటక రంగం పెరగాలి. వ్యవసాయంలోనూ డిమాండ్ ఉన్న పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలి. ఆక్వా కల్చర్‌ను పెంపొందించాలి. దావోస్ పర్యటనలో బిల్ గేట్స్‌తో మాట్లాడిన సమయంలో ఏఐ, డీప్ టెక్ ప్రాజెక్టుల్లో ఏపీకి అడ్వైజర్‌గా ఉండాలని ఆయన్ని కోరాను. అందుకు బిల్ గేట్స్ అంగీకరించారు. బిల్ గేట్స్ వైద్య రంగంలో కొన్ని వినూత్న పద్ధతులు ఏపీలో చేద్దామని చెప్పారు. ప్రివెంటివ్, క్యూరేటివ్ మెడిసిన్‌లోనూ వినూత్న పద్ధతులకు గేట్స్
మిలిందా ఫౌండేషన్ సహకరిస్తుందని ఆయన చెప్పారు. అయితే ఇవన్నీ చేయాలంటే సుస్థిర పాలన, ప్రభుత్వం కొనసాగింపు ఉండాలి. ఆ దిశగానే ప్రయత్నాలు చేస్తున్నాం. దావోస్ పర్యటనకు వెళ్తే మనం నాలెడ్జ అప్?గ్రేడ్ చేసుకోవచ్చు. ప్రపంచం ఎటు వెళ్తుందో తెలుసుకోవచ్చు. ప్రపంచం ఇప్పుడు గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఇండస్ట్రీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మీద నడుస్తోంది. మనం కూడా ఆ దిశగా వెళ్లాల్సిన అవసరం ఉంది. ఉత్పత్తులు చేసే వస్తువులు గ్లోబల్ రేంజ్‌లో తయారు చేస్తే ఎక్కువ రేటు సంపాదించ వచ్చు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌లో దేశంలోనే ఏపీ హబ్‌గా మారాలి. ఇందు కోసం ప్రయత్నాలు ప్రారంభించాం. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని అంతర్జాతీయంగా అందరూ ఆమోదిస్తున్నారు.
మన వాళ్లకూ ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పనిచేసే తత్వం ఉంటుంది. ఏపీలో విధ్వంసమైన బ్రాండ్, వ్యవస్థలను ట్రాక్‌లో పెడుతున్నామని చంద్రబాబు చెప్పారు. ఇకపోతే వైసీపీ కీలక నేత విజయసాయి రెడ్డి రాజకీయాలకు గుడ్‌బై చెప్పేయడం, విజయసాయి రెడ్డి రాజకీయ సన్యాసంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. విజయసాయి రాజీనామా అనేది వాళ్ల పార్టీ అంతర్గత సమస్య అని అన్నారు. ఆ పార్టీ పరిస్థితి ఎలా ఉందో మనం అర్థం చేసుకోవచ్చని తెలిపారు. 'నేను అంతకుమించి ఆ విషయం పై కామెంట్ చేయను' అని స్పష్టం చేశారు.

# కేంద్రం నిధులిస్తోంది..మోడీ ఫోటో పెట్టాల్సిందే

**కరీంనగర్:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరుతో కేంద్రం మంజూరు చేసిన ఇళ్లకు 'ఇందిరమ్మ' పేరు పెడతానంటే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేసే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ తేల్చి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ పేరు పెడితే కేంద్ర ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వదని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరు పెడితేనే నిధులు ఇస్తామన్నారు. కాంగ్రెస్ ఫొటోలు పెడితే రేషన్ కార్డులు ఇవ్వబోమన్నారు. తామే ముద్రించి ప్రజలకు రేషన్ కార్డులు ఇస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మాజీ సీఎం కేసీఆర్ మీద ఆయన విమర్శలు గుప్పించారు. కొత్త రేషన్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రధాని మోదీ ఫొటో ముద్రించాల్సిందేనని అన్నారు. రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో పెట్టకపోతే ఉచిత బియ్యం ఎందుకివ్వాలని ప్రశ్నించారు. ప్రధాని ఫొటో పెట్టకపోతే పేదలకు కేంద్రమే నేరుగా ఉచిత బియ్యం అందించే అంశంపై ఆలోచన చేస్తామన్నారు. కరీంనగర్ మేయర్ సునీల్ రావు భాజపాలో చేరిన అనంతరం బండి సంజయ్ మాట్లాడారు. 'ఎప్పుడు ఎన్నికలు జరిగినా కరీంనగర్ కార్పొరేషన్ భాజపాదని అన్నారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చినా గత పదేళ్లలో ఏనాడూ భారాస నేతలు నన్ను పిలవలేదు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు నేను నిధులు తీసుకొస్తే.. వాళ్లు పనులు ప్రారంభించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు నిధులను దారిమళ్లిస్తే.. కొట్లాడి మరీ అడ్డుకున్నానని అన్నారు. కరీంనగర్ కోసం ఎంత కష్టపడినప్పటికీ నన్ను ఏనాడూ ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవకుండా దూరంపెట్టారు. మోదీ ప్రభుత్వం అందించిన నిధులతోనే కరీంనగర్‌లో అభివృద్ధి జరిగిందని ప్రజలకు అర్థమైంది. భారాస పాలనలో అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయింది. మాజీ సీఎం కేసీఆర్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తున్నారు' అని బండి సంజయ్ దుయ్యబట్టారు.
రేవంత్‌కు గురువు కేసీఆరేనని బండి సంజయ్ అన్నారు. 'రేవంత్‌కు కేసీఆరే గురువు. కేసీఆర్ ఏం చేశారో.. రేవంత్ అదే చేస్తున్నారు. రేవంత్ పనిలో కొత్తదనం ఏమీ లేదు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైంది? కాళేశ్వరం అవినీతి ఎక్కడకు పోయింది? కేసీఆర్‌ను జైల్లో ఎందుకు వేయడం లేదు? రేపే అరెస్ట్ అని ఇంకా ఎన్ని రోజులు అంటారు? ఫార్ములా కారు రేసు కేసులో కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? గ్రీన్ కో కంపెనీ నుంచి కాంగ్రెస్‌కు డబ్బులు ముట్టాయ్. దావోస్‌కు రెండుసార్లు పోయినా.. పెట్టుబడులపై స్పష్టత లేదు. శ్వేత పత్రం విడుదల చేయాలి' అని బండి సంజయ్ డిమాండ్ చేశార్ను

# పండగ వాతావరణంలో పథకాల ప్రారంభం

నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సి.ఎం కార్యాలయ కార్యదర్శులు శేషాద్రి, చంద్ర శేఖర్ రెడ్డి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాష్ , పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో ఈ నాలుగు పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందించాలని స్పష్టం చేశారు. రేపు, 26 వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఈ పథకాల పండుగను ప్రారంభించాలని తెలిపారు. నాలుగు పథకాలకు గాను రేషన్ కార్డులకు సంబంధించి తహసీల్దార్ నేతృత్వంలో ప్రత్యేక టీమ్, ఇందిరమ్మ ఇండ్లకు గాని ఎండీఓ ఆధ్వర్యంలో, రైతు భరోసాకు మండల వ్యవసాయ అధికారి, డిప్యూటీ తహసీల్దార్ లేదా రెవెన్యూ ఇన్స్పెక్టర్ టీమ్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీ పథకం ఏపీఓ టీమ్ లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని సి.ఎస్ సూచించారు. పథకాల ప్రారంభోత్సవ ఏర్పాట్లు ఈ రోజు సాయంత్రం నుండే మొదలు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ప్రారంభించే ప్రతీ గ్రామానికి మండల స్పెషల్ అధికారి ఇంఛార్జిగా నియమించాలన్నారు. జిల్లా కలెక్టర్లు అర్హుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థ పునాది.





**ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరు గుర్తెరగాలి.**

**జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్ పిలుపు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 25**

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థ పునాదిగా నిలుస్తోందని, దీనిని గుర్తెరిగి ప్రతి ఒక్కరు ఎంతో విలువైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించగా, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా ముఖ్య అతిథిగా విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అనంతరం, వీడియో క్లిప్ ద్వారా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సందేశం వినిపించారు. తదుపరి ఓటర్లతో...ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాజ్యాంగం ద్వారా ప్రసాదించబడిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాదిగా నిలుస్తోందని గుర్తు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఎన్నికల సంఘం పకడ్బందీగా ఎన్నికలు జరిపిస్తోందని, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రతీసారి వినూత్న పద్ధతులను ప్రవేశపెడుతూ ప్రజలలో చైతన్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే గత ఎన్నికల్లో 80 ఏళ్ళు పైబడిన వృద్ధులు, నలభై శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యంగులకు ఇంటి నుండే ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తూ ఓట్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని గుర్తు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ఆయా పార్టీల వారు ప్రచార అనుమతుల కోసం ఆన్ లైన్లో దరఖాస్తులు చేసుకునేలా అనుమతుల ప్రక్రియను సులభతరం చేసిందన్నారు. ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలను గమనిస్తే ప్రజలు ఫిర్యాదు చేసేందుకు వీలుగా సి-విజిల్ వంటి యాప్ లను కూడా ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచిందని అన్నారు. మన దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా కొనసాగుతున్న ఓటింగ్ వ్యవస్థ వల్ల అధికార మార్పిడి ప్రక్రియ సాఫీగా జరుగుతోందని, ఇది దేశాభివృద్ధికి కూడా దోహదపడుతోందని కలెక్టర్ గుర్తు చేశారు. ఎంతో కీలకమైన ఎన్నికల ప్రక్రియ నిరాటంకంగా జరిగేందుకు అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ఎన్.సీ.సీ క్యాడెట్లు తదితరులు సైతం తమవంతు సహకారం అందిస్తున్నారని అన్నారు. ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఇదివరకు ఏడాదికి ఒక పర్యాయం చేపట్టేదని, ప్రస్తుతం ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. 17 సంవత్సరాల వారు కూడా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటే, వారికి 18 సంవత్సరాలు నిండిన వెంటనే ఓటరు జాబితాలో పేరు నమోదు చేయడం జరుగుతుందని సూచించారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాల్సిందిగా పలువురి నుండి వచ్చిన అభ్యర్థనలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకుంటూ ఈ.సీ.ఐకు ప్రతిపాదిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రజలు ఎవరైనా సరే కలెక్టరేట్ తో పాటు సహాయ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలను సంప్రదించి ఎన్నికలతో ముడిపడిన అంశాలపై తమ సలహాలు, సూచనలను అందించవచ్చని తెలిపారు. ముఖ్య అతిథి వికాస్ మీనా, అదనపు కలెక్టర్ అంకిత్ లు మాట్లాడుతూ, స్వేచ్ఛాయుత వాతావరణంలో మనకు నచ్చిన నాయకులను ఓటు ద్వారా ఎన్నుకునే అవకాశం కేవలం ఓటు హక్కు ద్వారానే సాధ్యమని, నా ఒక్క ఓటుతో ఏమవుతుందిలే అనే భావన ఎంతమాత్రం సరికాదని, ప్రజాస్వామ్య పరిరక్షణలో, మంచి పాలకులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటూ ఎంతో కీలకమైనదని సూచించారు. అప్పుడే ప్రజాస్వామ్యం మరింతగా పరిఢవిల్లుతుందని సూచించారు. ఎన్నికలలో ఎలాంటి ప్రలోభాలకు ప్రభావితం కాకుండా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో క్రమం తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుంటున్న 80 ఏళ్ళ పైబడిన సీనియర్ సిటిజన్లు నాగుల సాయమ్మ, కొట్టూర్ ఇందిరా, అవధూత భూమయ్య, మెరుగు ఒడ్డెమ్మ, అంకం సుశీల, వై.నర్సయ్యలను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా కొత్తగా నమోదైన యువ ఓటర్లు నబీలా నూరిన్, లోకేష్ గౌడ్ అంబటి, షేక్ సుమేర్, సయ్యద్ అబ్దుల్ రెహమాన్, అబ్దుల్ ఇర్ఫాన్, రాచర్ల భవన్ కుమార్ లకు కొత్త ఓటరు ఐ.డీలను అందించి సత్కరించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా స్వీప్ అధికారి సురేష్ కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు, ఎన్.సీ.సీ క్యాడెట్లు, పెద్ద సంఖ్యలో ఓటర్లు పాల్గొన్నారు.

# విద్య వైద్య రంగాన్ని బలోపేతం చేయాలి.

**- బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్. సిద్దిరాములు.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జనవరి 25:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య రంగాన్ని బలోపేతానికి తగిన నిధులు కేటాయించాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బిఎల్ పి)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరిగాద సిద్దిరాములు డిమాండ్ చేశారు.
బిఎల్ఎఫ్ 7వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బిఎల్ పి కార్యాలయం వద్ద బిఎల్ఎఫ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ విద్య, వైద్య రంగ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్ మరియు గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లను, సిబ్బంది నియమించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలతో పాటు విద్య వైద్య రంగాన్ని బలోపేతానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర
ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగారపు యెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యూనివర్సిటీ" నూతన వెబ్సైట్ ఆవిష్కరణ.

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, జనవరి 25**



తెలంగాణ విశ్వ విద్యాలయం నూతన వెబ్సైట్ ను వర్సిటీ వీసీ ఆచార్య యాదగిరి రావు శనివారం ఆయన చాంబర్ లో ఆవిష్కరించారు. విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న అధికారుల సమగ్ర వివరాలతో పాటు వర్సిటీ అందించే వివిధ కోర్సులు, అనుబంధ కళాశాలలు, అవి అందించే కోర్సుల వివరాల ను ఈ వెబ్సైట్ లో పొందుపరిచారు. వర్సిటీ లో ఉన్న వివిధ విభాగాలతో పాటు పరీక్షల విభాగం, డైరెక్టరేట్ ఆఫ అకడెమిక్ ఆడిట్, అడ్మిషన్ల విభాగం, ఐ క్యూ ఏసీ , ఎన్ స్ స్ , హాస్టల్స్ తదితర విభాగాల వివరాలు ఈ వెబ్సైట్ లో పొందుపరిచారు. విద్యార్థుల కు, కళాశాలకు సంబంధించిన నోటిఫికేషన్ లు, పరీక్షల తేదీలు తదితర విషయాలను ఎప్పటికప్పుడు వెబ్సైట్ లో పొందుపరచ నున్నట్టు ఆచార్య యాదగిరి రావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జీ. చంద్రశేఖర్, వెబ్సైట్ అండ్ నెట్వర్క్ డైరెక్టర్ డాక్టర్ అతిక్ సుల్తాన్ ఘోరి డాక్టర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

# ఉర్దు మీడియం స్కూల్ లో నూడా చైర్మన్ కేశ వేణు భూమి పూజ.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 25:**

నగరంలోని ఉర్దు మీడియం స్కూల్ లో తరగదుల నిర్మాణానికి నూడా చైర్మన్ కేశ వేణు శనివారం భూమి పూజ చేశారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సహకారంతో ఎస్డిఎఫ్ నిధులు సుమారు 25 లక్షలు రూపాయలతో నిజాంకాలనీలో గల ఉర్దూ మీడియం స్కూల్ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ముచ్చుకూర్ లావణ్య, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, వెంకటేష్, ప్రీతం పాల్గొన్నారు.


# 38వ నేషనల్ గేమ్స్‌కు డిసిడిఎంగా ఈగ సంజీవ్ రెడ్డి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 25**



ఉత్తరాఖాండ్ లో ఈ నెల 28 నుండి ఫిబ్రవరి 14 వరకు జరగనున్న నేషనల్ గేమ్స్ కు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఈగ సంజీవ్ రెడ్డి డిప్యూటీ చీఫ్ డి మిషన్ గా నియమితులయ్యారు. తెలంగాణ నుండి ఇద్దరిని డిప్యూటీ చీఫ్ డి మిషన్ లుగా నియమించగా, జిల్లాకు చెందిన ఈగ సంజీవ్ రెడ్డి నియమితులవడం విశేషం. జాతీయ క్రీడలకు డిప్యూటీ చీఫ్ డి మిషన్ గా ఈగ సంజీవరెడ్డి నియమితులు
కావడం పట్ల జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ అంద్యాల లింగన్న, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య జిల్లా కార్యవర్గం క్రీడా సంఘాల బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# సంక్షేమ పథకాల అమలుకు నేడు అట్టహాసంగా శ్రీకారం.






**- అధికారులకు దిశా నిర్దేశం చేసిన కలెక్టర్.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జనవరి 25**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఆదివారం నుండి శ్రీకారం చుట్టడం జరుగుతోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు .ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ప్రతిష్టాత్మక నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం చేపట్టాల్సిన చర్యల గురించి తెలియజేశారు. అనంతరం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాల అమలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి మండలంలో ప్రజాప్రతినిధులను సంప్రదించి వారి సూచన మేరకు ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన ప్రతీ గ్రామంలోనూ పథకాల ప్రారంభోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎలాంటి తప్పిదాలు, గందరగోళానికి తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేదిక, షామియానా, తాగునీరు వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లను చేయాలన్నారు. ప్రజాప్రతినిధులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించాలని, మధ్యాహ్నం ఒంటి గంటకు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టాలన్నారు. ఎంపిక చేసిన గ్రామంలోనే నాలుగు పథకాల అమలును ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ముందుగా ముఖ్యమంత్రి సందేశంతో కూడిన వీడియోను ప్రదర్శించాలన్నారు. ఒక్కో పథకానికి గాను ప్రత్యేకంగా ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆహార భద్రత కార్డులకు తహసీల్దార్ నేతృత్వంలో, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపీడీఓ ఆధ్వర్యంలో, రైతు భరోసాకు మండల వ్యవసాయ అధికారి నేతృత్వంలో, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి గాను ఏ.పీ.ఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు ఓవరాల్ ఇంచార్జీలుగా వ్యవహరిస్తూ నాలుగు సంక్షేమ పథకాల అమలు ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

గ్రామాలకు వెళ్ళడానికి ముందే ఆయా పథకాలకు సంబంధించిన లబ్దిదారుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జాబితాలో నూటికి నూరు శాతం అర్హులు మాత్రమే ఉండేలా సరి చూసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనర్హులు ఉండకూడదని అన్నారు. ప్రజాపాలన గ్రామ సభల సంధర్భంగా వచ్చిన దరఖాస్తులను సైతం పరిశీలించి, ఆయా పథకాల కింద అర్హుల పేర్లను జాబితాలో చేర్చాలని, పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలోనే వారికి కూడా పథకాల మంజూరీకి సంబంధించిన ప్రొసీడింగ్స్ అందించాలని కలెక్టర్ సూచించారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా తప్పనిసరి లబ్ది చేకూరేలా చొరవ చూపాలని అన్నారు. అదే సమయంలో అనర్హులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు
. ఎలాంటి విమర్శలు, ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముగిసిన "బార్"క్రీడాపోటీలు



**వేగుచుక్క న్యూస్:నిజామాబాద్**

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీలు శనివారం ముగిసినట్లు బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ తెలిపారు. క్రికెట్, చెస్,క్యారమ్స్, షెటిల్ న్యాయమూర్తులు,న్యాయవాదుల మధ్య స్నేహపూర్వకంగా జరిగినట్లు తెలిపారు. శనివారం నిజామాబాద్ నగరంలోని నాగారం స్టేడియంలో న్యాయమూర్థులు, న్యాయవాదుల మధ్య జరిగిన క్రికెట్
పోటీలో న్యాయమూర్తుల జట్టు మొదట బ్యాటింగ్ చేసి మొత్తం పది ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన న్యాయవాదుల జట్టు 92 పరిగులు చేసి ఓటమిపాలుఅయింది. విజేతలకు రిపబ్లికన్ డే న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ముఖ్యఅతిథిగా పాల్గొనే కార్యక్రమంలో బహుమతుల ప్రధానం జరుగుతుందని జగన్ అన్నారు.

# బడా రామ్ మందిర్ సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 25**

గాజుల్ పేట్ బడా రామ్ మందిర్ లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద ఘటన స్థలాన్ని శనివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పరిశీలించారు. నగరంలో అతిపురాతనమైన దేవాలయం బడా రామ్ మందిర్ లో గోశాల పక్కన ఉన్న గడ్డివాముకు అగ్ని ప్రమాదం జరగటం దురదృష్టకరం అన్నారు. అదృష్టవశాత్తు పక్కనే ఉన్న గోవులకు ఎటువంటి నష్టం జరగలేదన్నారు. సంఘటన విషయమై దేవాదాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే గారు ఫోన్లో మాట్లాడి సంఘటనకు గల కారణాలు అడిగితెలుసుకున్నారు, ఇప్పటివరకు బాధ్యులైన వారిని గుర్తించకపోవడం కనీసం పోలీస్ శాఖకు పిర్యాదు చేయకపోవడం పై మండిపడ్డారు. మందిరానికి
చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం, సెక్యూరిటీ లేకపోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆలయ కమిటీ, స్థానికులు ఎమ్మెల్యే కు విన్నవించుకోగ, ఎమ్మెల్యే స్పందిస్తూ దేవాదాయ శాఖతో మాట్లాడి త్వరలో ప్రహరీ నిర్మాణంతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మినారాయణ, స్థానిక కార్పొరేటర్ బట్టు రాఘవేందర్, గోకుల్ గోసేవ సమితి అల్లాడి రాజు , కృపల్ సింగ్, డివిజన్ బీజేపీ నాయకులు, బాల కృష్ణ,సుధాకర్,రమేష్, దీపక్,వెంకటరాములు,తదితరులు పాల్గొన్నారు.

వేగుచుక్క

# కలర్స్ స్వాతి విడాకుల ఇష్యూ..



కలర్స్ స్వాతి గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. టీవీ షో కలర్స్‌తో కెరీర్‌ను మొదలు పెట్టిన స్వాతి సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి బాల నటిగా నటించడంతో పాటు హీరోయిన్‌గానూ పలు సినిమాల్లో నటించింది. ఆ మధ్య ఇండస్ట్రీకి కొన్నాళ్లు దూరంగా ఉన్నా తిరిగి సినిమాల్లో నటించేందుకు స్వాతి రెడీ అవుతున్నారు. మరో వైపు స్వాతి విడాకుల గురించి మళ్లీ మీడియాలో వార్తలు వస్తున్నాయి. కొన్నాళ్ల క్రితం తన సోషల్ మీడియా అకౌంట్స్ నుంచి భర్త వికాస్ ఫోటోలను పూర్తిగా డిలీట్ చేసింది. ఆ సమయంలో విడాకుల వార్తలను కొట్టి పారేసింది. తాజాగా ఈ ఇష్యూ మళ్లీ హాట్ టాపిక్ అవుతుంది ఎందుకంటే..

టాలీవుడ్‌లో తెలుగు అమ్మాయిలు హీరోయిన్స్‌గా కనిపించని సమయంలో కలర్స్ స్వాతి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. కలర్స్ అనే టీవీ షో ద్వారా పాపులారిటీని సొంతం చేసుకోవడం ద్వారా సినిమాల్లో ఆఫర్లు సొంతం చేసుకుంది. సినిమాల్లో మొదట స్వాతి బాల నటిగా కనిపించారు. ఆ తర్వాత కొన్నాళ్లకు హీరోయిన్‌గానూ సినిమాల్లో నటించారు. స్వాతి నటించిన అష్టాచమ్మా సినిమా ఎంత పెద్ద విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తెలుగు అమ్మాయి కావడంతో టాలీవుడ్‌లో పెద్ద హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకోలేక పోయింది. అయితే స్వాతి వచ్చిన ప్రతి ఆఫర్‌ని సద్వినియోగం చేసుకున్నారు.

తెలుగులో పెద్ద ఆఫర్లు రాకున్నా ఇతర భాషల్లో ఈమెకు మంచి గుర్తింపు దక్కింది. ముఖ్యంగా తమిళ్, మలయాళంలో స్వాతి నటించిన సినిమాలకు మంచి స్పందన దక్కింది. రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న స్వాతి మధ్యలో గ్యాప్ తీసుకున్నా రెగ్యులర్‌గా వార్తల్లో ఉంటున్నారు. 2018లో వికాస్‌ను వివాహం చేసుకున్న స్వాతి కొన్నాళ్లకే ఆయన నుంచి విడి పోయిందనే వార్తలు వచ్చాయి. కానీ ఆ సమయంలో స్వాతి ఆ వార్తలను కొట్టి పారేసింది. ఆ తర్వాత కొన్నాళ్లకు తన సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ నుంచి పెళ్లి ఫోటోలతో పాటు, వికాస్‌తో ఉన్న ఫోటోలు అన్నింటిని డిలీట్ చేసింది. ఆ సమయంలోనే ఇద్దరూ విడి పోయారు అంటూ బలంగా ప్రచారం జరిగింది.

ఆ సమయంలోనూ స్వాతి తాము విడిపోలేదని చెప్పే ప్రయత్నం చేసింది. ఫోటోలను డిలీట్ చేస్తే విడాకులు తీసుకున్నట్లు ఎలా అవుతుందని ఆమె ప్రశ్నించింది. తమ ఫోటోలు అన్నీ భద్రంగా దాచుకున్నట్లుగా ఆమె చెప్పుకొచ్చింది. దాంతో అప్పుడు స్వాతి - వికాస్‌ల విడాకుల వార్తలకు తెర పడింది. తాజాగా మరోసారి వీరి విడాకుల గురించి ప్రచారం మొదలైంది. ఫోటోలు డిలీట్ చేసిన స్వాతి ఇప్పుడు వికాస్‌ను సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేసింది. దాంతో ఇద్దరి విడాకులకు ఇదే సాక్ష్యం అంటూ నెటిజన్స్ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఫోటోలు డిలీట్ చేసిన సమయంలో కవర్ చేసిన స్వాతి ఇప్పుడు అన్‌ఫాలో విషయంపై ఎలా స్పందిస్తుంది అనేది చూడాలి.

సాధారణంగా సెలబ్రిటీలు విడాకులు తీసుకుంటే బాహాటంగా ప్రకటిస్తారు. కానీ స్వాతి మాత్రం తమ విడాకుల విషయాన్ని ఎందుకు రహస్యంగా ఉంచుతుందని కొందరు ప్రశ్నిస్తున్నారు. వికాస్‌తో ఆమెకి విభేదాలు ఉన్నాయేమో కానీ విడాకులు తీసుకుని ఉండదని కొందరు అంటున్నారు. విడాకులు తీసుకోని కారణంగానే ఇప్పటి వరకు ఆమె అధికారికంగా ఆ విషయాన్ని వెల్లడించలేదు. ఫోటోలు డిలీట్ చేయడం, అన్‌ఫాలో చేయడం చూస్తూ ఉంటే ఇద్దరి మధ్య సఖ్యత లేదనే వాదనలకు బలంచేకూరింది.

# వేడి పుట్టించేలా పోజులు



పూజా హెగ్డే ప్రస్తుతం నెట్టింట్లో వదిలిన ఫోటోలు చూస్తే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. ఇక వేడి పుట్టించేలా పెట్టిన పోజులు చూసి ఆమె ఫ్యాన్స్‌కు పిచ్చెక్కేలా ఉంది. సోషల్ మీడియాలో మామూలుగానే తారలు అందాల ప్రదర్శనలో రెచ్చిపోతోంటారు. ఇక ఇప్పుడు ఇలా పూజా హెగ్డే హాట్ ఫోటో షూట్లతో కుర్రాళ్లను కట్టి పడేసేందుకు వచ్చారు. ప్రస్తుతం వీరి ఫోటోలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి.

సోషల్ మీడియాలో తారల సందడి మామూలుగా ఉండదన్న సంగతి తెలిసిందే. సోషల్ మీడియాలో తారలు తమ తమ అందాలను ప్రదర్శిస్తూ ఫాలోవర్లను పెంచుకుంటూ ఉంటారు. హీరోయిన్ల ఫోటో షూట్లకు, వారు పెట్టే పోజులకు వారి వారి ఫ్యాన్స్ ఫిదా అవుతుంటారు. తాజాగా పూజా హెగ్డే, వంటి వారు పెట్టిన ఫోటోలకు సోషల్ మీడియా వేడెక్కిపోయేలా ఉంది. ఇన్ స్టాలో వీరు పెట్టిన మంటలు ఇప్పట్లో చల్లారేలా లేవు. ఇక పూజా హెగ్డే అయితే అటు సినిమాలతో ఇటు సోషల్ మీడియాలో అందాల ప్రదర్శనతో అందరినీ మెప్పిస్తూ ఉంది. ప్రస్తుతం ఈ బుట్టబొమ్మకు తెలుగులో అంతగా ఆఫర్లు రావడం లేదనిపిస్తుంది. బాలీవుడ్ మీదే పూజా హెగ్డే ఎక్కువగా ఫోకస్ పెట్టినట్టుగా అనిపిస్తోంది. జనవరి 31న షాహిద్ కపూర్ దేవా సినిమాతో ఆడియెన్స్ ముందుకు పూజా హెగ్డే రాబోతోంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా కూడా సోషల్ మీడియాను మాత్రం వదిలిపెట్టదు. పూజా హెగ్డే ప్రస్తుతం నెట్టింట్లో అందాల ప్రదర్శనతో అందరినీ కట్టి పడేస్తోంది. ఘాటు అందాల ప్రదర్శనతో హాటు ఫోటోలను వదిలింది. ఇక ఈ ఫోటో షూట్ చూస్తే ఆమె ఫాలోవర్లకు కునుకు ఉండకపోవచ్చనిపిస్తోంది. నెట్టింట్లో హీరోయిన్ల అందాల ప్రదర్శన మీద ఎప్పుడూ చర్చలు జరుగుతూనే ఉంటాయి. ఇలాంటి ఫోటో షూట్లతోనే భామలు మీడియాలో, సోషల్ మీడియాలో ఎక్కువగా హైలెట్ అవుతుంటారన్న సంగతి తెలిసిందే.

# మధుప్రియని అరెస్ట్ చేయాల్సిందే..



ఆడపిల్లానమ్మా.. నువ్వు బాధపడకమ్మా అంటూ అప్పట్లో జానపద గీతంతో సంగీత ప్రియుల్ని మెప్పించిన సింగర్ మధుప్రియ రీసెంట్‌గా సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో 'గోదారి గట్టుపైన రామచిలకవే' అంటూ రమణగోగులతో గొంతు కలిపి.. సంగీత ప్రపంచాన్నే ఊపేసింది. తన గాన మాధుర్యంగా సంగీత ప్రియుల్ని ఆకట్టుకుంటున్న సింగర్ మధుప్రియ.. వివాదంలో చిక్కుకున్నారు. ఇటీవల జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో ఒక పాట చిత్రీకరణ జరిగింది.

'గోదారి గట్టుపైన రామచిలకవే' అంటూ రమణగోగులతో గొంతు కలిపి.. సంక్రాంతికి వస్తున్నాం సినిమా బ్లాక్ బస్టర్ హిట్‌లో భాగం పంచుకున్న సింగర్ మధుప్రియ వివాదంలో చిక్కుకున్నారు. తెలుగు సినీ, బుల్లి తెర ప్రేక్షకులకు సింగర్ మధుప్రియ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. చిన్నప్పటి నుంచే గాయనిగా మధుప్రియ టీవీల్లో కనిపిస్తూ వస్తుంది. గద్దర్ వంటి కళాకారులతో కలిసి ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో మధుప్రియ ఫేమస్ అయ్యారు. ఎన్నో టీవీ షోల్లో పాల్గొని తన గాత్రంతో అలరించిన మధుప్రియ సినిమాల్లోనూ పాటలు పాడి ఆకట్టుకున్నారు.

ఎప్పుడూ పాటలతో, తన మ్యూజిక్ వీడియోలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉండే మధు ప్రియ ఈసారి ఒక వివాదం కారణంగా వార్తల్లో నిలిచింది. తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మధుప్రియ తన కొత్త మ్యూజిక్ ఆల్బమ్ షూటింగ్ చేశారు. సాధారణంగా గుడిలో షూటింగ్‌కి అనుమతి ఉండదు. గర్భ గుడిలోని దేవుడిని ఫోన్‌తో ఫోటోలు దించేందుకు అనుమతి ఉండదు. కానీ మధు ప్రియ ఆలయంలోని గర్భగుడిలో షూటింగ్ చేసింది. అక్కడ కెమెరాలు పెట్టి మరీ తన పాట చిత్రీకరణ చేయడం పెద్ద దుమారంను రేపుతోంది. ఈ విషయమై బీజేపీ నాయకులు, హిందుత్వ వాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే బీజేపీ నాయకులు మధుప్రియపై చర్యలు తీసుకోవాలం టూ డిమాండ్ చేస్తున్నారు. మధు ప్రియ హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించారని వారు ఆరోపిస్తున్నారు. ఈనెల 20వ తారీకు గాయని మధుప్రియ శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలోని గర్భగుడిలో ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్ షూట్ చేశారు. గర్భగుడిలోకి వెళ్లడానికి ఆమెకు ఆలయ అధికారులు అనుమతి ఇవ్వలేదని కొందరు అంటూ ఉంటే, కొందరు ఈవో అనుమతితోనే మధుప్రియ గర్భగుడిలో షూటింగ్ చేసిందని కొందరు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ విషయమై ఆలయ అధికారుల నుంచి అధికారికంగా స్పందన రాలేదు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించినందుకు గాను మధుప్రియను కఠినంగా శిక్షించాలని, ఆమెపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అంతే కాకుండా ఆలయంలో షూటింగ్‌కు అనుమతించినందుకు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గాను గుడి ఈవోను సస్పెండ్ చేయాలని స్థానిక భక్తులు, బీజేపీ నాయకులు గుడి ముందు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. అయితే ఈ వివాదాన్ని కొంతమంది రాజకీయంగానూ వాడుకుంటుంటున్నారనే వాదన కూడా వినిపిస్తుంది.

# ముగ్గురు పిల్లలతో సెటిల్ అవుతా..



దేవర సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ భామ వింతకోరికలేంటో చూసేయండి.

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన శ్రీదేవి నట వారసురాలిగా జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో అడుగు పెట్టింది. హిందీలో చాలా సినిమాలే చేసినా ఏ ఒక్క సినిమా ఈమెకు స్టార్‌డం తెచ్చి పెట్టలేదు. కానీ సోషల్ మీడియా ద్వారా ఈమె షేర్ చేసే ఫోటోలు, వీడియోల కారణంగా, శ్రీదేవి, బోనీ కపూర్ కూతురు కావడంతో బాలీవుడ్‌లో వరుసగా ఆఫర్లు వచ్చాయి. సక్సెస్ దక్కకున్నా బాలీవుడ్‌లోనే సినిమాలు చేస్తూ వచ్చిన జాన్వీ కపూర్ గత ఏడాది దేవర సినిమాతో టాలీవుడ్‌లో అడుగు పెట్టింది. షూటింగ్ నిమిత్తం హైదరాబాద్ వచ్చినా, ఏదైనా ప్రత్యేక రోజుల్లో అయినా జాన్వీ కపూర్ తప్పనిసరిగా తిరుమల తిరుపతి వెళ్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటూ ఉంటారు. నెలకు కనీసం ఒక్కసారి అయినా తిరుమల శ్రీవారిని జాన్వీ కపూర్ దర్శించుకుంటుంది. తిరుమలకు ఎప్పుడు వచ్చినా చాలా సంతోషంగా ఉంటుందని, ప్రశాంతంగా అనిపిస్తుందని జాన్వీ కపూర్ అంటుంది. గతంలో ఒకసారి తాను తిరుపతిలోనే పెళ్లి చేసుకుంటాను అంది. కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, సినిమా ఇండస్ట్రీకి చెందిన వారితో ఎప్పుడూ జాన్వీ కపూర్ తిరుపతికి వచ్చి పోతూ ఉండటం మనం చూస్తూనే ఉంటాం. తాజాగా ఒక టాక్ షోలో తనకు తిరుమల తిరుపతిపై ఉన్న అభిమానాన్ని మరోసారి చాటుకుంది. కరణ్ జోహార్‌తో కలిసి టాక్ షోలో పాల్గొన్న జాన్వీ కపూర్ మాట్లాడుతూ.. తిరుపతిలో పెళ్లి చేసుకుని ముగ్గురు పిల్లలకు తల్లి అయ్యి అక్కడే భర్తతో కలిసి జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నాను. ప్రతి రోజూ గోవింద నామాలు వింటూ, అరటి ఆకులో భోజనం చేస్తూ, మణిరత్నం మ్యూజిక్ వింటూ జీవితాన్ని సంతోషంగా సాగించాలని కోరుకుంటున్నట్లు చెప్పింది. లుంగీ కట్టుకుని ఉన్న తన భర్తకు మసాజ్ చేస్తూ జీవితాన్ని సంతోషంగా, రొమాంటిక్‌గా, ప్రశాంతంగా గడపాలని కోరుకుంటున్నట్లు జాన్వీ కపూర్ చెబుతూ ఉంటే పక్కనే ఉన్న కరణ్ జోహార్ షాక్ అయ్యి అలాగే ఆమె వైపు చూస్తూ ఉండి పోయారు. జాన్వీ కపూర్‌కి తిరుమల అన్నా, అక్కడి పరిసరాలు అన్నా చాలా ఇష్టం అని గతంలోనే చాలా సార్లు చెప్పింది. జాన్వీ కపూర్ కోరిక చాలా వింతగా ఉందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తే, జాన్వీ కపూర్ వంటి సింపుల్ పర్సన్‌ని ఇండస్ట్రీలో చాలా అరుదుగా చూస్తూ ఉంటామని కొందరు అంటున్నారు. ప్రస్తుతానికి ఇండస్ట్రీలో హీరోయిన్‌గా చాలా బిజీగా ఉన్న జాన్వీ కపూర్ తన కోరిక నెరవేరడానికి చాలా కాలమే వెయిట్ చేయాల్సి రావచ్చు.

# 'మదగజరాజా'.. సీన్‌లోకి వెంకీమామ




మదగజరాజా సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. సినిమా దాదాపు రూ.50 కోట్ల వసూళ్లు రాబట్టింది. తమిళ్‌లో విజయాన్ని సొంతం చేసుకున్న ఈ సినిమాను తెలుగులో డబ్ చేసి రిలీజ్‌కి రెడీ చేశారు. రేపు వెంకటేష్ చేతుల మీదుగా ట్రైలర్ విడుదల కానున్న ఈ సినిమాను జనవరి 31న తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు.

టాలీవుడ్‌లో సంక్రాంతి సందర్భంగా మూడు పెద్ద సినిమాలు విడుదల అయ్యాయి. అందులో సంక్రాంతికి వస్తున్నాం సినిమా బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుని రూ.300 కోట్ల వసూళ్ల దిశగా పరుగులు తీస్తుంది. మరో సినిమా డాకు మహారాజ్ సినిమా రూ.150 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. మరో సినిమా గేమ్ ఛేంజర్ నిరాశ పరచింది. మరో వైపు కోలీవుడ్‌లో పొంగల్ రేసులో స్టార్ హీరో అజిత్ సినిమా నిలువనుందని మొదటి నుంచి వార్తలు వచ్చాయి. కానీ చివరి నిమిషంలో కొన్ని కారణాల వల్ల అజిత్ మూవీ విడుదల క్యాన్సల్ అయ్యింది. దాంతో అర డజను చిన్న తమిళ సినిమాలు విడుదల అయ్యాయి. అందులో విశాల్ నటించిన 'మదగజరాజా' సినిమా సైతం ఉంది.

విశాల్ హీరోగా అంజలి, వరలక్ష్మి శరత్ కుమార్ హీరోయిన్స్‌గా నటించిన మదగజరాజా సినిమాకు సుందర్ సి దర్శకత్వం వహించారు. ఎప్పుడో 2013లో విడుదల కావాల్సిన ఈ సినిమా కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. షూటింగ్ అంతా పూర్తి అయిన తర్వాత నిలిచి పోయిన మదగజరాజా సినిమాను పొంగల్ రేసులో దర్శకుడు సుందర్ సి దించారు.

విశాల్ ఆరోగ్య పరిస్థితి గురించి చర్చ జరగడంతో పాటు మదగజరాజా సినిమా గురించి జనాల్లో చర్చ మొదలైంది. ఆ సినిమా ఈవెంట్‌లో విశాల్ ఇలా అంటూ వీడియోలు వైరల్ కావడంతో సినిమాకు బజ్ క్రియేట్ అయ్యింది. సినిమాకి క్రియేట్ అయిన బజ్ కి తగ్గట్లుగా పాజిటివ్ టాక్ దక్కింది. సినిమా మొదటి పది రోజుల్లోనే దాదాపుగా రూ.40 కోట్ల వసూళ్లు రాబట్టిన మదగజరాజా సినిమా లాంగ్‌రన్‌లో వంద కోట్లు రాబట్టడం ఖాయం అనే ధీమాతో బాక్సాఫీస్ వర్గాల వారు ఉన్నాయి. ఇప్పుడు టాలీవుడ్ ప్రేక్షకుల ముందుకు మదగజరాజా సినిమా రాబోతుంది. జనవరి 31న తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున విడుదల చేయడం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

తెలుగులో విశాల్‌కి మంచి మార్కెట్ ఉంది. గతంలో ఆయన నటించిన పలు తమిళ సినిమాలు తెలుగులో డబ్ అయ్యి మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ముఖ్యంగా విశాల్ మాస్ సినిమాలకు ఇక్కడ మంచి ఫాలోయింగ్ ఉంది. అందుకే ఈ సినిమాను తెలుగులో డబ్ చేస్తే కచ్చితంగా లాభం ఉంటుందని భావించి థియేటర్ రిలీజ్‌కి సిద్ధం అయ్యారు. దర్శకుడు సుందర్ సి సైతం తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడు. అందుకే మదగజరాజా సినిమాకి బిగ్ రిలీజ్ దక్కింది. రేపు (జనవరి 25) వెంకటేష్ చేతుల మీదుగా మదగజరాజా సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేయబోతున్నారు. సినిమా విడుదలకు ముందు విశాల్ లేదా అంజలి హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. మొత్తానికి తెలుగులోనూ అదే టైటిల్‌తో డైరెక్ట్ తెలుగు సినిమా రేంజ్‌లో రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నారు. తమిళ్ ఫలితం తెలుగులో రిపీట్ అయ్యేనా చూడాలి.

# ప్రభాస్‌కి విలన్‌గా



మెగా హీరో వరుణ్ తేజ్ కెరీర్ ప్రస్తుతం చాలా వీక్‌గా ఉంది. ఎన్ని ప్రయోగాలు చేసినా, ఎలాంటి విభిన్నమైన పాత్రలు వేసినా ఫలితం మాత్రం రావడం లేదు. వరుణ్ తేజ్ ఒక కమర్షియల్ సక్సెస్ అందుకొని చాలా కాలం అయిపోయింది. ఇటీవల రిలీజైన మట్కా కూడా ఘోరంగా ఫెయిల్ అయింది. దీంతో ఏం చేయాలా అనే ఆలోచనలో వరుణ్ తేజ్ ఉన్నాడు. అయితే ఇలాంటి సమయంలో ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ప్రభాస్-సందీప్ రెడ్డి వంగా కాంబోలో 'స్పిరిట్' అనే చిత్రం రానుంది. ఇందులో నిజాయతీ గల పోలీస్ ఆఫీసర్ పాత్రలో ప్రభాస్ నటించబోతున్నారు. అయితే ఈ సినిమాలో మెగా హీరో వరుణ్ తేజ్‌ని ఒక విలన్ రోల్‌కి సెలక్ట్ చేశారంటూ టాక్ నడుస్తోంది. ఇది నిజమో కాదో తెలియదు కానీ ఈ వార్త మాత్రం వైరల్ అవుతోంది. ముఖ్యంగా ప్రభాస్ ముందు వరుణ్ తేజ్ విలన్‌గా కరెక్ట్‌గా సరిపోతాడంటూ రెబల్ ఫ్యాన్స్ కూడా అంటున్నారు. ఎందుకంటే వరుణ్ తేజ్ ఆరడగులపైనే ఉంటాడు.. పైగా బాడీ కూడా అదిరిపోతుంది. దీంతో ప్రభాస్ ముందు సరిగ్గా సరిపోతాడంటూ ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు.

ఇదే సందర్భంలో గతంలో ప్రభాస్ గురించి వరుణ్ తేజ్ మాట్లాడిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో వరుణ్ తేజ్ సినిమా ఈవెంట్‌కి ప్రభాస్ గెస్టుగా వెళ్లారు. ఆ సమయంలో ప్రభాస్ గురించి వరుణ్ తేజ్ చాలా గొప్పగా మాట్లాడాడు. "నేను చాలా ఇంటర్వ్యూల్లో చెప్పాను.. నేను ఛత్రపతి నుంచో బాహుబలి నుంచో ఆయన ఫ్యాన్ కాదు.. ఈశ్వర్ సినిమా అప్పుడే నేను ఫస్ట్‌డే మార్నింగ్ షోకి వెళ్లాను.. అంత ఇష్టం ప్రభాస్ అంటే.. ఆయనతో స్టేజ్ పంచుకోవడం చాలా ఆనందంగా ఉంది." అంటూ వరుణ్ తేజ్ అన్నాడు. ఈ వీడియోని ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు ఫ్యాన్స్. అప్పట్లోనే వరుణ్ తేజ్ ఓ హింట్ ఇచ్చాడని.. ప్రభాస్‌తో నటించాలని వరుణ్‌కి ఎప్పటినుంచో కోరిక ఉందంటూ నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. ఖచ్చితంగా ఈ కాంబో అదిరిపోతుందని అభిప్రాయపడుతున్నారు. ఇక ఈ చిత్రం క్యాస్టింగ్ గురించి ఇప్పటివరకూ సందీప్ రెడ్డి చెప్పలేదు. ప్రస్తుతానికి అయితే స్పిరిట్ స్క్రిప్ట్ వర్క్‌తో ఆయన బిజీగా ఉన్నారు. కానీ సాధారణంగానే సందీప్ రెడ్డి క్యాస్టింగ్ సెలక్షన్ చాలా బావుంటుంది. యానిమల్ సినిమాకి విలన్‌గా బాబీ డియోల్‌ని తీసుకోవడం ఏ రేంజ్‌లో క్లిక్ అయిందో తెలిసిందే. ఈ సినిమాతో బాబీ కెరీర్‌యే టర్న్ అయిపోయింది. మరి ఇప్పుడు వరుణ్ తేజ్‌ని కూడా అలానే ఏమైనా ట్రాక్‌లోకి తెస్తాడేమో చూడాలి.